5న స్పేస్ ఎక్స్‌పో

మైలార్‌దేవ్‌పల్లి: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ నేతృత్వంలోని జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్, కేవ ల్యాబ్ సహకారంతో కాటేదాన్ శాంతినగర్‌లోని రవిస్ బ్రిలియంట్ స్కూల్ ఆవరణలో ఈ నెల 5వ తేదీన స్పేస్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎస్.ఆర్.రజనీకాంత్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగే ఈ ఎక్స్‌పోలో విద్యార్థులకు పరిశోధనల నమూనాల తయారీకి కావాల్సిన అద్భుతమైన అనుభవం లభించనుందన్నారు. విద్యార్థుల్లో సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారాలను చూపే ఆలోచనల దిశగా ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, మండల విద్యాధికారి కె.శంకర్ రాథోడ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి తదితరులు పాల్గొంటారని రజనీకాంత్ తెలిపారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



చికిత్స చేస్తున్న వైద్యులు

శంషాబాద్: ఎలాంటి మందులు లేకుండా దీర్ఘకాలిక వ్యాధులతో పాటు నొప్పులకు సంబంధించిన సమస్యలను ఆంక్యుపంక్చర్ వైద్యంతో సురక్షిత విధానంలో తగ్గించుకోవచ్చని మోర్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మోర్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ధర్మగిరి దేవాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆంక్యుపంక్చర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆంక్యుపంక్చర్ వైద్యం ఎంతో పురాతనమైనది.. సురక్షితమైందన్నారు. ఎలాంటి అపోహలు లేకుండా ఈ వైద్యం ద్వారా రోగులు ఉపశమనం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆక్యుపంక్చర్ వైద్యులు ఆచార్య మాధవ్, వంశీకృష్ణ తదితరులున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నేత వెంకటేష్

మైలార్‌దేవ్‌పల్లి: ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ కౌన్సిలర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సోమ శ్రీనివాస్‌గుప్తా తండ్రి కీర్తిశేషులు సోమ జగన్నాథం గుప్తా పేరునా బాబుల్‌రెడ్డినగర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో సోమ అశోక్, సోమ సందీప్, ఆంజనేయులు, పి.జగన్, హనుమంత్, కిషోర్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల సమాచారం మేరకు... పల్లెచెరువు నుంచి మహవీర్ కాలేజీకి వెళ్లే దారిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా 40–45 సంవత్సరాల ఉండే వ్యక్తి చనిపోయి ఉన్నాడన్నారు. స్థానికంగా ఆచూకీ కోసం ప్రయత్నించగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని తెలిసిందన్నారు. అనారోగ్య కారణంగా చనిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు శంకుస్థాపన

రాయదుర్గం: కొండాపూర్ డివిజన్‌లోని ఓయూ ప్రొఫెసర్స్ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. అంతర్గతరోడ్లను దశలవారీగా సీసీ రోడ్లుగా మార్చే ప్రక్రియలో భాగంగా రూ.60.70 లక్షల వ్యయంతో రోడ్డు పనులను చేపట్టనున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు

గోల్కొండ: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలు అందిస్తున్నాయని గోల్కొండ ఏరియాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు అన్నారు. కాయాకల్ప్ పీర్ అసెస్‌మెంట్‌లో భాగంగా గోల్కొండ ఏరియా ఆసుపత్రి వైద్య బృందం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిని గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల వల్ల వైద్యులు తమ అభిప్రాయాలను ఒకరితో మరొకరు పంచుకోవచ్చన్నారు.

స్ఫూర్తిప్రదాత కొమురయ్య

దొడ్డి కొమురయ్యకు ఘనంగా నివాళి



హైదర్‌గూడ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న అత్తాపూర్ కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్ తదితరులు

అత్తాపూర్: తెలంగాణ పోరాటంలో దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకమని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంగ్ర సంగీతగౌరీశంకర్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డిలు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో హైదర్‌గూడ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అత్తాపూర్ కార్పొరేటర్ మోంగ్ర సంగీతగౌరీశంకర్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డిలు పాల్గొన్నారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దొడ్డి కొమురయ్య నిజాంతో పోరాటం సాగిస్తూ తెలంగాణ సమాజాన్ని సంఘటితం చేస్తూ అమరుడయ్యారన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాడెం సుధాకర్, విజయ్‌కుమార్, ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు నర్సింహ, జయానంద్‌రెడ్డి, నల్లింగ్ రమేష్, కిరణ్‌చారి, కిట్టు, రాజు, రావుల జగన్, వెంకట్‌రెడ్డి, విశాల్‌శర్మ, బాలకృష్ణ, శశికాంత్, విజయ, స్వామి, ముఖేష్, అనురాధ, సతీస్, శ్రీను, శ్రీశైలం, శివ, రాము, కె.ప్రసాద్, బీట్కూరి శ్రీనివాస్, కాడెం నర్సింగ్‌రావు, నల్లింగ్ రాజు, ఆనంద్, రాంబాబు, ధనుంజయ్, మహేందర్ పాల్గొన్నారు.

బాబుల్‌రెడ్డినగర్‌లో...

మైలార్‌దేవ్‌పల్లి: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరకంగా వీరోచితంగా పోరాడిన దొడ్డి కొమురయ్యను ప్రజలు మరచిపోలేరని హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం జంట నగరాల అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు. బాబుల్‌రెడ్డినగర్‌లో కార్యాలయంలో దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంఘం వ్యవస్థాపకులు కొల్లంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జట్రం కృష్ణ, కార్యదర్శి రామ్‌చందర్, ఉప్పల్ శ్రీను, మల్లేష్, అశోక్‌కుమార్, రాజ్‌కుమార్, ప్రవీణ్, సన్నీ, ఆనంద్, రఘు, రవి, శేఖర్, శంకర్, శ్రీశైలం పాల్గొన్నారు.

మణికొండలో...

మణికొండ: మణికొండ కురుమ సంఘం కమిటీ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతిని నిర్వహించారు. మణికొండ బీరప్ప మల్లన్న స్వామి ఆలయ ప్రాంగణం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. చైర్మన్ బి.జైహింద్‌రావు, వైస్ చైర్మన్ శ్రీరాములు చిన్న, ఉపాధ్యక్షుడు జె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మణ కోశాధికారి సి.బీరప్ప, ఉపకోశాధికారి డి.కృష్ణ, సభ్యులు బి.ఆంజనేయులు, బి.సదానంద్, జి.చంద్రప్రకాష్, బి.శివకుమార్, జె.సందీప్, డి.మహేందర్, వి.మధు, డి.శ్రీనివాస్, శేఖర్, ఎన్.బి.శర్మ తదితరులు పాల్గొన్నారు.



మణికొండ బీరప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో...



బాబుల్‌రెడ్డినగర్‌లో నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం



వరద నీటితో మునిగిన హైదర్‌గూడ రహదారి




అత్తాపూర్‌లోని శివనగర్‌లో నిలిచిన వరద నీరు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజేంద్రనగర్ ప్రధాన రహదారి, బుద్వేల్ రోడ్డు ప్రాంతాల్లో ఈదురు గాలులకు చెట్టు కొమ్మలు విరిగి పడటంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది వెంటనే స్పందించి చెట్టు కొమ్మలను తొలగించారు. చెట్టు కొమ్మలు విరిగిన సమయంలో రహదారిపై ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. భారీ వర్షం కారణంగా ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి, ఆరాంఘర్, ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి ప్రాంతాల్లో వర్షాపు నీరు నిలిచిపోయింది. గత కొన్ని రోజులుగా ఎండ వేడిమితో సతమతమైన ప్రజలు వర్షం కారణంగా వాతావరణం చల్లడటంతో సేద తీరారు.

ఈదురు గాలులతో విద్యుత్ సరఫరాకు అంతారాయం

మణికొండ: అప్పటి వరకు ఉన్న వేడి వాతావరణం ఒక్కసారిగా మారి ఈదురుగాలులు, వర్షంతో మణికొండ మున్సిపాలిటీలోని పలు కాలనీలలో గంట నుంచి రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతారాయం ఏర్పడింది. గురువారం సాయంత్రం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో తేలికపాటి వర్షం కురిసింది. అంతకు ముందు భారీ ఈదురుగాలులు రావటంతో విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలు వాటికి తగిలి వైర్లు తెగిపోవటం, ఫీడర్‌లు బ్రేక్ అయ్యాయి. దాంతో వెంటనే అప్రమత్తమైన విద్యుత్ ఏఈ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఒక్కో లైన్‌లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

రాములోరి కల్యాణోత్సవానికి ఆహ్వానం



విద్యుద్దీపాలతో బుద్వేల్ ఆలయం

రాజేంద్రనగర్: శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలకు రాజేంద్రనగర్ పరిధిలోని దేవాలయాలు ముస్తాబవుతున్నాయి. కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని దేవాలయాలను సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే రాములవారి దేవాలయాలను రంగు రంగులతో అందంగా తీర్చిదిద్దారు. హైదర్‌గూడ, సిరిమల్లెనగర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఎర్రబోడ, బుద్వేల్, గ్రీన్ సిటీ, రాజేంద్రనగర్ ప్రాంతాల్లోని దేవాలయాలలో కల్యాణ మహోత్సవాల కోసం భారీ ఏర్పాట్లు చేపట్టారు. ప్రతి సంవత్సరం ఈ దేవాలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం శోభాయాత్రలను నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాలయాలతో పాటు బస్తీలు, కాలనీల్లో సైతం కల్యాణ మహోత్సవ ఏర్పాట్లు జోరందుకున్నాయి. కల్యాణానికి వచ్చే భక్తులకు ఇబ్బందులకు కలుగకుండా తగు ఏర్పాట్లు చేపడుతున్నారు.

గేటెడ్ కమ్యూనిటీస్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీస్ రెసిడెన్షస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్, కోకాపేటకు చెందిన పి.చంద్రశేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 18 గేటెడ్ కమ్యూనిటీల నాయకులు గురువారం నార్సింగిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గేటెడ్ కమ్యూనిటీలలో ఉన్న సమస్యల పరిష్కారానికి కలసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉందని వారు నిర్ణయించారు. అందుకు కార్యవర్గ కమిటీని ఎన్నుకోవాలని నిర్ణయించి అధ్యక్షుడునిగా పి. చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షునిగా నీలేష్ దూబే, ప్రధాన కార్యదర్శిగా బండారు సురేష్, సంయుక్త కార్యదర్శిగా సుమన్ భట్, కోశాధికారిగా ఎ.నర్సింహారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్‌రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, విష్ణురెడ్డి, టి. శ్రీనివాస్, రమేష్‌రెడ్డి, అవినాష్‌లను ఎన్నుకున్నట్టు అధ్యక్షుడు తెలిపారు.

అకారణంగా వైద్యుడిపై దాడి

భార్యపై కూడా దాడి చేశాడంటూ పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్: కారణం లేకుండా భౌతిక దాడులకు పాల్పడుతూ న్యూసెన్స్ చేస్తుండటమే కాకుండా అడగడానికి వెళ్లిన భార్యను అసభ్య పదజాలంతో దూషించిన పొరుగింటి వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఓ వైద్యుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14లోని స్వర్ణ హెవెన్స్‌లో నివసించే గోపీనాథ్ వృత్తిరీత్యా వైద్యుడు. తన ఫ్లాట్ ఎదురుగా ముసళ్ల రాజు ఉంటున్నాడు. తరచూ తనపై అకారణంగా దాడి చేస్తున్నాడని, ఈ క్రమంలోనే ఈ నెల 1వ తేదీన తనపై దాడి చేసే క్రమంలో కిందకు నెట్టేయడంతో పడిపోయాయనని, అంతటి ఆగకుండా చెప్పులతో దాడి చేశాడని గోపీనాథ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయాన్ని అడిగేందుకు వెళ్లిన ఆయన భార్యను సైతం అసభ్య పదజాలంతో దూషించాడంటూ తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే 'గుడ్ మార్నింగ్ మణికొండ'



సాయిరామ్‌నగర్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ: గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా గురువారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం సాయిరాం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాలనీలలోని డ్రైనేజీ నీరంతా వచ్చి సాయిరామ్ కాలనీ వద్ద కలుసుకొని ముందుకు సాగుతున్నందున ప్రతి ఇంటి వారు వారం వారం పని కట్టుకొని డ్రైనేజీని క్లీన్ చేయించుకోవాల్సి వస్తుందన్నారు. వీధి దీపాలు చాలా రోజులుగా వెలగడం లేదన్నారు. విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని ఆరోపించారు. వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందన్నారు. వేసవి పూర్తిస్థాయిలో ప్రారంభం కాకముందే నీటి ఎద్దడి మొదలైందన్నారు. వేళాపాలా లేకుండా అరగంట మాత్రమే మంచినీటిని సరఫరా చేస్తున్నారన్నారు. మున్సిపల్ అధికారులు వీధులను శుభ్ర పరచడానికి సఫాయి కర్మచారీలను వారం రోజులకు ఒక మారు పంపడం వలన వీధి మొత్తం చెత్తతో నిండి ఉంటుందన్నారు. స్థానిక నేతలు గుట్టమీది నరేందర్, బుద్దోలు బాబు, మాల్యాద్రినాయుడు, శ్రీనివాస్ చారి, సంఘం శ్రీకాంత్, కిరణ్ యాలాల, బండమీది మల్లేస్, భానుచందర్, సుమనళిని, బొడ్డు శ్రీధర్, చెరుకూరి బాలాజీ, రమణమూర్తి, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

గోల్కొండ: ఉత్సవాలు, ర్యాలీలు ప్రశాంతంగా జరుపుకోవాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులతో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగలు, ఊరేగింపుల సమయాల్లో అసాంఘిక శక్తులు పుకార్లు వ్యాపింపజేస్తాయని వాటిని నమ్మవద్దని కోరారు. శ్రీరామనవమికి ర్యాలీలు నిర్వహించే వారు అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటివరకు ఆలయాలు, ప్రార్థన స్థలాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోని వారు వెంటనే అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, డీఎస్సై రఫీ, ఆబిద్, మిర్జా ఎక్బాల్ అహ్మద్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



- రోల్‌మోడల్‌గా రాయదుర్గం వైకుంఠ మహాప్రస్థానం
- ప్రపంచంలో ఎక్కడి నుంచైనా దహన సంస్కారాలు తిలకించే సౌకర్యం
- తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా, కాశీలో కూడా ఫినిక్స్ సంస్థ మహాప్రస్థానాల ఏర్పాట్లు



మహాప్రస్థానం సేవల కొరకు సంప్రదించాల్సిన నంబర్ : 9852555555



రాయదుర్గంలోని వైకుంఠ మహాప్రస్థానం ప్రధాన ద్వారం

పదేళ్ల ప్రస్థానం ..

రాయదుర్గం: వైకుంఠ మహాప్రస్థానం రోల్‌మోడల్‌గా నిలిచింది. ఫినిక్స్ సంస్థ సేవా దృక్పథంతో జీహెచ్‌ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైకుంఠ మహా ప్రస్థానంను 2015 మార్చి 30న అప్పటి మంత్రి వెంకయ్యానాయుడు ప్రారంభించారు. ఇదే తరహాలో బంజారాహిల్స్, బేగంపేటలోనే కాకుండా ఏపీలోని మంగళగిరి, కాశీ వంటి ప్రాంతాలలో కూడా ఏర్పాటు చేశారు. దేశంలోనే ఎకోఫ్రెండ్లీ శ్మశానవాటికగా రాయదుర్గం మహాప్రస్థానం గుర్తింపు సాధించింది.

- జూబ్లీహిల్స్ నుంచి ఫిలింనగర్ వెళ్లే రోడ్డులో రాయదుర్గం మహాప్రస్థానం 3.7 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇక్కడ గతంలో ఉన్న సమాధులు చెక్కుచెదరకుండా వాటి చుట్టూ గ్రీనరీ, పూల మొక్కలను పెంచుతున్నారు.
- ఇక్కడ జరిగే అంత్యక్రియలను వైఫై సౌకర్యంతో ప్రపంచంలో ఎక్కడ ఉన్నా చూడవచ్చు.
- ఇందులో 33 మంది సిబ్బంది పూర్తిస్థాయిలో సేవా దృక్పథంతో పనిచేస్తున్నారు.
- చుక్కపల్లి శంకర్‌రావు మెమోరియల్ ఆధ్వర్యంలో 2013లో అప్పటి ఎమ్మెల్యే భిక్షపతియాదవ్, ఫినిక్స్ గ్రూప్ చైర్మన్ చుక్కపల్లి సురేష్‌లు శంకుస్థాపన చేశారు.
- ప్రస్తుతం మహాప్రస్థానంలోని 7 దహనవాటికల్లో నెలకు సుమారు 150 నుంచి 200 మంది వరకు దహన సంస్కారాలను నిర్వహిస్తోంది.
- ఇందులో 5 బర్నింగ్ ప్లాంట్లు, ఒక ఎలక్ట్రికల్, ఒక గ్యాస్ ఆధారిత ప్లాంట్ కొనసాగుతున్నాయి.
- ప్రతి దహనవాటికకు పక్కనే వెయింటింగ్ హాల్ నిర్మించారు. పిండ ప్రదానాలకు సిరిమోనియల్ యార్డ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. పూజారి, ఇతర సేవలు ఉన్నాయి.
- ప్రత్యేకంగా ×యాషెస్ స్టోరేజ్ లాకర్స్॰ సౌకర్యం ఉంది. మృతదేహాలను భద్రపరిచే కోల్డ్ రూమ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.
- కర్మకాండ వస్తువులు ఇక్కడ ఉన్న స్టోర్‌లో లభ్యమవుతున్నాయి
- వచ్చినవారికి క్యాంటిన్, తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉన్నాయి.
- ప్రత్యేక బుక్‌స్టోర్, విశాలమైన కార్ పార్కింగ్, సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బంది. వాష్ రూమ్స్, డ్రెస్ ఛేంజింగ్ రూమ్స్, మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉన్నాయి.
- మృతదేహాన్ని ఆస్పత్రి లేదా ఇంటి నుంచి తీసుకొచ్చేందుకు ప్రత్యేక వాహనాలను సైతం అందుబాటులో ఉంచారు.

అవార్డులు

- ఫినిక్స్ గ్రూపు మహాప్రస్థానం నిర్మించడంతో పలు అవార్డులను సొంతం చేసుకుంది. అందులో 2017లో ఏసీఈఎఫ్ ద్వారా ఎక్సలెన్స్ ఇన్ సీఎస్ఆర్ అవార్డు,
- సీఎంఒ ఏఎస్ఐఏ ద్వారా స్మార్ట్ సీఎస్ఆర్ ఇనీషియేటివ్ అవార్డు
- హెచ్ఎంఏ ద్వారా సీఎస్ఆర్ అవార్డు ఆఫ్ ది ఇయర్ –2017గా గుర్తింపు పొందింది. ఇలా పలు అవార్డులు సాధించింది.



సాధారణ దహనవాటిక



ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు ఘన నివాళి

గోల్కొండ: కార్వాన్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఉద్దడి జగదీశ్ కుమార్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేశ్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు గంజి రఘునాథ్‌రావు, బాలకృష్ణ, దుర్గరాజ్, చందుసాగర్, హరీశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల స్వాధీనాన్ని విరమించుకోవాలి

హిమాయత్‌నగర్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) భూములను స్వాధీనపర్చుకోవాలనే ఆలోచనలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ నారాయణరావు డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ... విద్యార్థులపై బనాయించిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలన్నారు. విద్యార్థులపై పోలీసుల అత్యుత్సాహం, లాఠీచార్జి చేయడాన్ని ఖండించాలన్నారు. హెచ్‌సీయూ భూములను, పర్యావరణాన్ని పరిరక్షించడానికి ఉద్యమిస్తున్న యూనివర్సిటీ విద్యార్థులకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఆ భూములు ప్రభుత్వం యూనివర్సిటీకి అప్పగించి, యూనివర్సిటీ పేరున రిజిస్ట్రేషన్ చెయాలన్నారు. ప్రజాస్వామిక హక్కుగా శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై అత్యుత్సాహం ప్రదర్శిస్తూ లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు పి.ఎం.రాజు, రఘునాథ్ పాల్గొన్నారు.